ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా రాష్ట్రం

• కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): రాష్ట్రవ్యాప్తంగా ఇంటి వద్దకే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు ప్రతి ఒక్కరికీ అందేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారని నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని కోడూరుపాడు, ఎన్టీఆర్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను పలువురు అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయి పర్యటించినప్పుడు ప్రజలకు వైద్యశిబిరాల్లో మెరుగైన సేవలు అందుతున్నట్లు తెలుస్తున్నాయన్నారు. క్యాంపుల నిర్వహణ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని తెలిపారు. నగరంలోని 21 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో క్యాంపుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు అత్యుత్తమ వైద్యసేవలు అందుతున్నాయని తెలిపారు. అనంతరం క్యాంపులో వైద్యపరీక్షలు చేయించుకున్న వారికి కళ్లజోళ్లు, వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార కిట్‌ను అందించారు. అలాగే అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, టీపీఆర్‌ఓ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



కోడూరుపాడు యూపీహెచ్‌సీలో జరిగిన వైద్యశిబిరంలో మందులు అందజేస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్ తదితరులు

ప్రతిష్టాత్మకంగా ..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని సచివాలయాల పరిధిలో పటిష్టంగా నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశించారు. నగరంలోని స్థానిక పీసీనాయుడు స్ట్రీట్, ఉడ్‌హౌస్ సంఘం 5/2, 6/3 వార్డు సచివాలయాలను కమిషనర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాల్లోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అన్ని సచివాలయాల పరిధిలో ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. వైద్యసేవలు అందరికీ చేరువయ్యేలా సచివాలయ హెల్త్ సెక్రటరీలు కృషి చేయాలని సూచించారు. అలాగే సచివాలయాల్లో పెండింగ్‌లో ఉన్న సేవలను గడువు లోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని సచివాలయాల కార్యదర్శులకు సూచించారు. ఎస్‌డీజీ సర్వే, భూహక్కు సర్వే, ఏపీ సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, సూచించిన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని తెలిపారు.

క్లుప్తంగా

బాలల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి

నెల్లూరు(టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు శుక్రవారం బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలు ఏవిధంగా అప్రమత్తంగా ఉండాలనే అంశాలను వివరించారు. బాలల హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐఓ, కళాశాల ప్రిన్సిపల్ ఆదూరు శ్రీనివాసులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక



సూర్యతేజను అభినందిస్తున్న దృశ్యం

నెల్లూరు(టౌన్): రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సూర్యతేజ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థి సూర్యతేజను ప్రిన్సిపల్ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు జరిగాయన్నారు. మహారాష్ట్రలోని కొలహాపూర్‌లో జరగనున్న జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో సూర్యతేజ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంబీఏ డీన్ ధనుంజయ, పీడీ ప్రసాద్, స్పోర్ట్స్ కన్వీనర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కెమెరామన్‌కు ఆర్థికసాయం



నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులో కెమెరామన్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో బాధపడుతున్న జార్జికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి రూ.2 లక్షల చెక్కును అందజేశారు. శుక్రవారం నెల్లూరు రూరల్‌లోని వీపీఆర్ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు, పార్టీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో జార్జికి చెక్కు అందజేశారు.

ములుముడిలో ఆరోగ్య సురక్ష



నెల్లూరు రూరల్: రూరల్ మండలంలోని ములుముడిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ సందర్శించారు. డాక్టర్లు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. వైద్యపరీక్షల అనంతరం రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

మనుబోలు: బ్యాంకు ఖాతాదారులు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ బి.నిఖిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని కాగితాలపూరు గ్రామంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, ఫోన్‌పే, గూగుల్‌పే తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఏపీజీబీ ద్వారా అందజేస్తున్న వివిధ రకాల రుణాలు, వడ్డీ రేట్ల గురించి వివరించారు. అత్యధిక వడ్డీ చెల్లించే డిపాజిట్ స్కీంలైన ప్రగతిసిరి 666 రోజులు, 400 రోజుల స్కీంల గురించి వివరించారు. ఈ సదస్సులో క్యాషియర్ కృష్ణమనాయుడు, బీసీ శ్రీకాంత్, మెసెంజర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు దసరా సంబరాలు

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ పరిధిలోని ముత్తుకూరు రోడ్డు పార్థసారథి నగర్‌లోని సద్గురు సిల్వర్ ఓక్స్ స్కూల్‌లో విద్యార్థులు శుక్రవారం ముందస్తుగా దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. 108 మంది విద్యార్థినులు అమ్మవారి వేషధారణలో కమలం ఆకారంలో ఉంటూ దసరా విశిష్టతను చాటారు. అలాగే ఉపాధ్యాయినులు బతుకమ్మను తయారు చేసి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు షణ్ముఖాచారి, వెంకటాద్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దుర్గాదేవి వేషధారణలో విద్యార్థినులు

పూర్వ విద్యార్థుల రక్తదాన శిబిరం

నెల్లూరు(టౌన్): స్థానిక సెయింట్ జోన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం నెల్లూరు లయన్స్ క్లబ్ పినాకిని, సెయింట్ జోన్స్ స్కూల్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సబ్ ట్రెజరీ అధికారి రోహిత్‌కుమార్ హాజరు కాగా, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సునీల్‌కుమార్, సెక్రటరీ సురేంద్ర, ట్రెజరర్ అనిల్, క్యాంపు చైర్మన్ సత్యనారాయణ, పూర్వ విద్యార్థుల ఆర్గనైజేషన్ నాయకులు చంద్రశేఖర్, సురేష్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం నిర్వహించిన లయన్స్‌క్లబ్ సభ్యులు, పూర్వ విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలో బొమ్మల కొలువు

నెల్లూరు(టౌన్): దసరా పండగను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక వైఎస్సార్ నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు దసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. అనంతరం బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి దసరా పండగ, బొమ్మల కొలువు విశిష్టతలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు

వృద్ధాశ్రమంలో అన్నదానం

నెల్లూరు(బృందావనం): నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి సతీమణి కొండ్రెడ్డి సంధ్య వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని బాలాజీనగర్ గీతామయి వృద్ధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండ్రెడ్డి సంధ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.



అన్నదానం చేస్తున్న కొండ్రెడ్డి రంగారెడ్డి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నెల్లూరు టౌన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుని సిబ్బందికి సహకరించాలని కోరారు. రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గుప్తాపార్కు, తూకుమానుమిట్ట, ములుమూడిబస్టాండ్, శివగిరికాలనీ, పరమేశ్వరినగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలో చాణుక్యపురి, ఏవీకే ఎస్టేట్, వీఎంఆర్ నగర్, గాంధీనగర్, సుభాష్‌చంద్రబోస్ నగర్, సంజయ్‌గాంధీనగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. అలాగే వైఎంసీఏ సబ్‌స్టేషన్ పరిధిలో ఆచారివీధి, చాకలివీధి, రాయాజీవీధి, పెద్దబజారు, కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో, కిసాన్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో జాకీర్‌హుస్సేన్‌నగర్, కిసాన్‌నగర్, ప్రశాంతినగర్, వేణుగోపాల్‌నగర్, మూడో మైలు, బంగ్లాతోట పరిసర ప్రాంతాల్లో, వెంకటేశ్వరపురం సబ్‌స్టేషన్ పరిధిలో వెంకటేశ్వరపురం, గాంధీగిరిజనకాలనీ పరిసర ప్రాంతాల్లో, హరనాథపురం సబ్‌స్టేషన్ పరిధిలో హరనాథపురంలోని అన్ని వీధులు, యలమవారిదిన్నె పరిధిలోని పద్మావతి గ్రీన్‌సిటీ, బలిజపాళెం, ఆకుతోట పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఏకేనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సావిత్రినగర్‌లోని 1వ వీధి నుంచి 11వ వీధి వరకు, చంద్రమౌళినగర్‌లోని 1వ వీధి నుంచి 13వ వీధి వరకు, వేదాయపాళెం సెంటర్, రిత్విక్ లేఅవుట్, జర్నలిస్టుకాలనీ, సింహపురికాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోవాలి

ఉదయగిరి: మండలంలోని వివిధ రకాల కులవృత్తిదారులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విశ్వకర్మ యోజనకు దరఖాస్తులు గ్రామ సచివాలయాల్లో ఆన్‌లైన్లో దాఖలు చేసుకోవాలని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ అన్నారు. ఆమె శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇందుకు సంబంధించి 17 పంచాయతీల్లోని సర్పంచ్‌లు లాగిన్ చేసుకుని విశ్వకర్మ యోజనకు వచ్చిన దరఖాస్తులను వాలిడేషన్ చేయాలన్నారు. కులవృత్తులకు సంబంధించి ఎంపికైన వారికి వారం రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారన్నారు.

దసరా ఉత్సవాలకు మంత్రికి ఆహ్వానం



మంత్రి కాకాణిని ఆహ్వానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

పొదలకూరు : పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆర్యవైశ్య నాయకులు శుక్రవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఉత్సవాలకు ఆహ్వానించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ ఆదూరు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రాచపూటి రామలింగయ్య, కార్యవర్గ సభ్యులు నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆహ్వానించారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు ఉంటాయని తెలిపారు.

హెచ్‌ఎంకు ప్రధాని నుంచి ప్రశంసాపత్రం



హెచ్‌ఎం తాటిపర్తి వెంకటేశ్వర్లు

కొడవలూరు: మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం తాటిపర్తి వెంకటేశ్వర్లుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నుంచి పోస్టు ద్వారా శుక్రవారం ప్రశంసాపత్రం అందింది. 'పరీక్షా పే చర్చ–2023' పేరుతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. విద్యార్థులు పరీక్షల పట్ల ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, దానిని జయించేందుకు ఈ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు కోరింది. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు, సలహాలు అందించినందుకు గాను ప్రధాని నుంచి ఈ ప్రశంసాపత్రం పంపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంకు ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య అభినందనలు తెలిపారు.

మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

నెల్లూరు(టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో ఆయా కోర్సుల్లో మిగిలిన సీట్లలో ప్రవేశాల కోసం ఈ నెల 16వ తేదీ నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం ఆనర్స్ జనరల్–14, కంప్యూటర్ అప్లికేషన్స్–7, బ్యాంకింగ్ ఇన్సూరెన్స్–13, బీఏ ఆనర్స్ స్పెషల్ ఇంగ్లిషు–28, స్పెషల్ తెలుగు–26, పొలిటికల్ సైన్స్–25, హిస్టరీ–27, ఎకనామిక్స్ 23, బీఎస్సీ ఆనర్స్ జువాలజీ–15, ఆక్వాకల్చర్–14, బయోటెక్నాలజీ–11, హోమ్ సైన్స్–5, బోటనీ–8, మ్యాథమ్యాటిక్స్–18, కెమిస్ట్రీ–27, ఫిజిక్స్–24, స్టాటిస్టిక్స్–9, కంప్యూటర్ సైన్స్–6 తదితర కోర్సుల్లో సీట్లు మిగిలాయని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థినులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 8639734668 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

దసరా సెలవుతో ఊర్లకు విద్యార్థులు

సంగం: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నుంచి 26వ తేదీ వరకు దసరా పండగ సందర్భంగా సెలవులు ప్రకటించడంతో సంగం గురుకుల కళాశాల విద్యార్థినులు తమ ఇళ్లకు పయనమయ్యారు. శుక్రవారం సంగం గురుకుల కళాశాల వద్దకు విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి వారిని ఇంటికి తీసుకెళ్తూ కనిపించారు.

శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి సేవలో..

నెల్లూరు(బృందావనం): నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కొలువైన శ్రీరాజరాజేశ్వరి అమ్మవారిని ఇన్వెస్ట్ ఇండియా సీనియర్ కన్సల్టెంట్(న్యూఢిల్లీ), ఐఏఎస్ అధికారిణి ఆరాధన శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, ధర్మకర్తల మండలి సభ్యులు ఆమెకు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అర్చకులు వేదాశీస్సులతో తీర్థప్రసాదాలను అందించారు.



గెలుపే లక్ష్యంగా సాగుదాం



నెల్లూరు సిటీ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. నెల్లూరు రూరల్‌లోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్ హాజరై రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ పి. చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మేయర్ స్రవంతి పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

ఘనంగా ప్రమాణ స్వీకారోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో శుక్రవారం రాత్రి నెల్లూరు జిల్లా డ్యాన్స్ మాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ – 2023 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లాలో డ్యాన్స్ మాస్టర్స్ ఐక్యతగా సాగి ప్రతిభతో రాణించి ఉన్నతంగా ఎదగాలన్నారు. కళాకారులుగా సింహపురి ఖ్యాతిని చాటాలని ఆకాంక్షించారు. జిల్లాలో ప్రతిభ గల కళాకారులకు కొదువలేదన్నారు. వారిలో దాగిన ప్రతిభను గుర్తించి అందరూ ప్రోత్సహించాలన్నారు. డ్యాన్స్ మాస్టర్స్ సంక్షేమానికి 25 కళాసంఘాలు తమవంతు తోడ్పాటు అందిస్తాయని అమరావతి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విశిష్ట గురువులను ఘనంగా సత్కరించారు. జిల్లా డ్యాన్స్ మాస్టర్స్ ప్రదర్శించిన నృత్యాలు ఆహుతుల్లో జోష్ నింపాయి. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పేరూరు ప్రదీప్, అందె శ్రీనివాసులు, శ్రీదేవి, అఖిలరెడ్డి, డాక్టర్ ఎస్.రమణకుమార్, మోపూరు భాస్కరనాయుడు, 25 కళా సంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, అమీర్‌జాన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అమరావతి కృష్ణారెడ్డి

రేపు ప్రతిభా పురస్కారాల ప్రదానం

నెల్లూరు(బారకాసు): తవిషి క్రియేషన్స్ 4వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా సినీ ప్రముఖులకు, ప్రముఖ కళాకారులకు, వ్యాపారవేత్తలకు, సామాజిక కార్యకర్తలకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నామని సంస్థ వ్యవస్థాపకుడు పూండ్ల లోకనాథ్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీన నగరంలోని పురమందిరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు హైదరాబాద్‌లోని పీవీఆర్ సినీ డబ్బింగ్ అకాడమి వారితో సినిమా డబ్బింగ్, వాయిస్ ఓవర్ వర్క్‌షాపు జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 10 గంటల వరకు హైదరాబాద్, రాజమండ్రి, వైజాగ్ కళాకారులతో స్వరాభిషేకంతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు. కళాకారులు, కళాభిమానులు, కళాపోషకులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వార్షికోత్సవ వేడుకకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.



వార్షికోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రోల్‌ప్లే, ఫోక్ డాన్స్ విజేతలకు ప్రశంసాపత్రాలు

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు డైట్ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన జిల్లా స్థాయి రోల్‌ప్లే, ఫోక్ డాన్స్ పోటీలు శుక్రవారం ముగిశాయి. రాష్ట్ర విద్యాశాఖ, ఎస్సీఈఆర్టీ జనాభా విద్య విభాగం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. రోల్‌ప్లే పోటీల్లో ఆత్మకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, పల్లిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. ఫోక్ డాన్స్ పోటీల్లో వావిళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, నిడుముసలి ప్రాథమికోన్నత పాఠశాల, విందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారని, వారికి ప్రశంసాపత్రాలు అందజేశామని డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రమేష్ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విజేతలు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు నరసాపురం విద్యార్థులు

ఇందుకూరుపేట: త్వరలో గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఇందుకూరుపేట మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పి.నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఆ పాఠశాలలో మాట్లాడుతూ నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ ఎంపికలు జరిగాయని, ఎం.మస్తానమ్మ (అండర్–17) 200 మీటర్లలో ప్రథమస్థానం, పి.అమూల్య (అండర్–17) 400 మీటర్లు, 800 మీటర్లలో ప్రథమస్థానం, పి.ఇందు (అండర్–14) హైజంప్‌లో ప్రథమ స్థానం సాధించారని తెలిపారు. అలాగే ఈ ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ ముజీర్‌ను సర్పంచ్ తాత సురేంద్ర, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శ్రీశంతన్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.



మస్తానమ్మ



అమూల్య



ఇందు

ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లొద్దు

ఉదయగిరి: మండలంలోని బూత్‌లెవల్ అధికారులతో శుక్రవారం తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటు నమోదు ఫారం క్షుణ్ణంగా పరిశీలించుకుని తగిన ధ్రువపత్రాలు సరిచూసుకోవాలన్నారు. జాబితాలో చనిపోయిన ఓట్లు ఉంటే వెంటనే తొలగించాలన్నారు.

డబుల్ ఎంట్రీలపై దృష్టి సారించాలన్నారు. ఇంటింటికి తిరిగి పరిశీలించాలన్నారు. ప్రతి ఇంటికి డోర్ నంబరు ఉండేలా చూసుకోవాలన్నారు. ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి ఎన్నికల సిబ్బంది పని చేయాలన్నారు.